క్లుప్తంగా

## రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులతో నూతన కార్యవర్గం

బేతంచెర్ల: పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం మండల రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె. భాస్కర్‌రెడ్డి, కె.రామ్ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రతాప్ రెడ్డి, బి.రామక్రిష్టారెడ్డి, శివరామ్ మోహన్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. సమాజ సేవతో పాటు రెడ్డి సామాజికవర్గంలోని పేదల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో హుసేన్‌రెడ్డి, సంఘం సభ్యులు మధు మోహన్‌రెడ్డి, బాల దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

## కొర్ర పంటలో సస్యరక్షణ అవసరం



రంగాపురంలో కొర్ర పంటను పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన కొర్ర పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో సాగు చేసిన కొర్ర పంటను పరిశీలించారు. పంట ఎదుగుదలకు వాడాల్సిన ఎరువులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

## లింగవివక్షను నిర్మూలిద్దాం



గర్భిణులకు బహుమతులను అందజేస్తున్న బ్రహ్మానంద ఆచారి

బనగానపల్లె: సమాజంలో మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని.. లింగ వివక్షకు తావులేదని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో లింగ వివక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. మగ పిల్లలే కావాలనుకోవడం మూర్ఖత్వం అన్నారు. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో సత్తా చాటుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలిక విద్యకు అన్ని రకాలుగా తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. అనంతరం గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, సుకన్య, రమణమ్మ, స్రవంతి, మనోహరమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

## చిన్నారులకు ఉచితంగా ఆధార్ సేవలు

కోవెలకుంట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యనభ్యసిస్తున్న ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా ఆధార్ సేవలు అందిస్తున్నట్లు కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు భాస్కర్ తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. ఈ నెల 27వ తేదీ వరకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు.

**ఆధార్ క్యాంపులు ప్రారంభం**

కొలిమిగుండ్ల: మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం బెలుం సచివాలయం పరిధిలో ఆధార్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ నమోదు, మరాఉప్పులు చేర్పులు చేసుకోవచ్చని సూచించారు. 25న కనకాద్రిపల్లె, కల్వటాల, 26, 27వ తేదీల్లో అంకిరెడ్డిపల్లె, బిడుప్పులూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు ఉంటాయని వెల్లడించారు.

## అదనపు కట్నం కేసు నమోదు

బేతంచెర్ల: తనను భర్త, అత్త, మామ, బావ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు బుధవారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. మండలంలోని రహిమానుపురం గ్రామానికి చెందిన బెస్త శరత్ కుమార్, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఉష ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొంత కాలంగా భర్త శరత్ కుమార్‌తో పాటు అత్త సరస్వతి, మామ ఆది నారాయణ, బావ నాగార్జున అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ.రమణ తెలిపారు.

## మండల మీట్ వాయిదా

అవుకు: మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కొన్ని అనివార్య కారణలతో ఈనెల 27వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి బుధవారం తెలిపారు. శనివారం ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

# జీవాలకు సీజనల్ ముప్పు

ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఆవులు, గొర్రెలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నిర్లక్ష్యం చేస్తే జీవాల ప్రాణాలకే ముప్పు. పాడి రైతులు, గొర్రెల కాపరులు వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే కాడుకోవచ్చు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు పశు వైద్యుల మాటల్లోనే..

- నీలినాలుక, చిటుకు వ్యాధులపై అప్రమత్తత అవసరం
- సకాలంలో గుర్తించకపోతే తీవ్ర నష్టం
- సూచనలు, సలహాలు పాటించాలంటున్న పశువైద్యులు



జీవాలకు నీలినాలుక వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

అవుకు: మండలంలో వ్యవసాయం, పాడి తర్వాత ఎక్కువ మంది జీవాల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో జీవాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే జీవాల పెంపకదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పశువైద్యులు అంటున్నారు. అవుకు పశువైద్యశాల పరిధిలో 48,361 గొర్రెలు, 24,594 మేకలు, అలాగే గుండ్లశింగవరం పశువైద్యశాల పరిధిలో 7,292 గొర్రెలు, 4,758 మేకలు ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మూగజీవాలకు సీజనల్ ముప్పు పొంచి ఉంది. వర్షాల్లో గొర్రెలకు ముఖ్యంగా నీలినాలుక, చిటుక వాధి వ్యాపించే అవకాశం ఉంది. సకాలంలో వ్యాధులను గుర్తించకపోతే జీవాలు చనిపోయే ప్రమాదం ఉంది. జీవాల పెంపకదారులు పశువైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే జీవాలకు సోకేవ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.

**నీలినాలుక (బ్లూటంగ్) వ్యాధి**

ఈ వ్యాధి ఆర్బి వైరస్ క్రిముల ద్వారా క్యూలికాయిడ్స్ అనే దోమ కాటు వల్ల గొర్రెలకు వ్యాపిస్తుంది. వర్షా కాలంలో ఈ దోమల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వ్యాధి తీవ్రత కూడా అధికంగా ఉండి గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంది. దోమ కాటు ద్వారా ఈ వైరస్ రక్తంలోకి చేరి రక్త కణాలను నాశనం చేస్తుంది. ఫలితంగా రక్త కణాలు విచ్ఛిన్నం కావడం, గడ్డకట్టుకుపోవడం జరిగి శరీరంలోని వివిధ భాగాల్లో రక్తస్రావం జరిగి, నీరు చేరి చివరికి గొర్రెలు చనిపోతుంటాయి.

**చిటుకువ్యాధి**

ఈ వ్యాధి ఆరోగ్యంగా ముఖ్యంగా బద్దె పురుగులు ఉన్న గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. క్లాస్ట్రిడియమ్ పెర్‌ఫ్రిజన్స్ డి అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. చిటుకు వ్యాధిని కలిగించే సూక్ష్మజీవులు గడ్డికి అంటుకున్న మట్టి ద్వారా గొర్రెల కడుపులోకి వెళ్తాయి. కొన్ని సూక్ష్మజీవులు కడుపులో నశిస్తాయి. మరికొన్ని పేగుల వరకు వెళ్లి అక్కడ విష పదార్థాన్ని వదులుతాయి. ఈ విషపదార్థాన్ని గొర్రెలు మలం ద్వారా బయటకు వదులుతాయి. అయితే కొన్ని సందర్భాల్లో సూక్ష్మజీవులు ఎక్కువై గొర్రెలు గిలగిలా కొట్టుకుని చనిపోతాయి. గొర్రెలు చనిపోయే ముందు పొట్ట ఉబ్బటం, వణుకు, తలను నేలకు వాల్చడం, పళ్లు కొరకడం, కడుపు నొప్పితో పొట్టను తన్నుకుంటూ ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**లక్షణాలు**

- ఈ వ్యాధి సోకినప్పుడు గొర్రెల్లో 104 నుంచి 106 ఫారెన్‌హీట్ డిగ్రీల వరకు జ్వరం ఉంటుంది.
- నాలుకలోని రక్త నాళాలు వాచిపోవడం వల్ల నాలుక నీలి రంగులోకి మారిపోతుంది.
- ముక్కులో నుంచి జిగురు వంటి ద్రవం కారుస్తుంది.
- కాలి గిట్టల మధ్య, పైభాగంలో చీము పట్టి నడవలేక కుంటుతుంటాయి.
- ఆకలి మందగించి మేత తినవు.. దీంతో బరువు తగ్గుతాయి.

**చికిత్స**

- వ్యాధి సోకిన గొర్రెలను మందలో నుంచి వేరుచేయాలి
- నోటి పుండ్లు ఉండడం వల్ల ఆహారాన్ని జీర్ణం చేసుకోలేవు. తేలిగ్గా జీర్ణం అయ్యే గంజి లాంటిది ఉప్పు కలిపి తాగించాలి
- ఓఆర్‌ఎస్ లాంటి ద్రవాలు వ్యాధి తగ్గే వరకు తాగించాలి.
- నొప్పి తగ్గడం కోసం ఇంజెక్షన్లు వేయించాలి. అలాగే సెకండరీ బ్యాక్టరియల్ ఇన్ఫెక్షన్స్ సోకకుండా యాంటీబయోటిక్స్, బీకాంప్లెక్స్ ఇంజెక్షన్స్ వేయాలి.

**సకాలంలో టీకాలు వేయించాలి**



జీవాల పెంపకందారులు సకాలంలో టీకాలు వేయించడం వల్ల వ్యాధుల నుంచి జీవాలను రక్షించుకోవచ్చు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాలను గమనిస్తూ ఏదైనా సమస్య ఉంటే పశువైద్యులను సంప్రదించాలి. బ్లూటంగ్ వ్యాధి నిరోధక టీకాలను మూడు నెలలు దాటిన గొర్రె పిల్లలకు వేయించాలి. ప్రస్తుతం బ్లూటంగ్ వ్యాక్సిన్ వేస్తున్నాం. మళ్లీ నెల తరువాత బూస్టర్ డోస్ వేయించాలి.

–భారతీ దేవి, పశువైద్యాధికారిణి, అవుకు

## డోన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత



నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

డోన్ టౌన్: వేతనాల పెంపుపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం పట్టణ లారీ యజమానులు, కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలమైంది. చర్చల సమయంలో కొందరు లారీ యజమానులు కార్మికులను అవహేళన చేయడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి నిరసనగా కార్మికులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్ ఎదుట గుమిగూడడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. లారీ యజమానులు, యూనియన్ నాయకులతో మరోసారి చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

## ఆదాయ పన్ను చెల్లించడం పౌరుల బాధ్యత

కోవెలకుంట్ల: వివిధ మార్గాల్లో ఆదాయం సంపాదించే ప్రతి పౌరుడు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఆదాయ పన్ను దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ రూపాల్లో ఆదాయం గడించే వ్యక్తులు చెల్లించే పన్ను ఆదాయంతో ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. కామర్స్ చదివే ప్రతి విద్యార్థి ఆదాయ పన్ను లెక్కించే విధానం తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ కింద పండ్ల తోటల సాగు



ఉపాధి హామీ సిబ్బందితో చర్చిస్తున్న ఏపీఓ

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు రైతులకు అనుమతి వచ్చి ఉంటే గుంతలు తవ్వుకుని మొక్కలు నాటుకోవాలని ఏపీఓ శేషన్న అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలోని రైతులు పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపితే దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుపై రంగాపురం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నాగార్జున, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

## స్పర్శలేని మచ్చలు కుష్టుకు సంకేతం



లక్షణాలను గుర్తిస్తున్న వైద్యురాలు

బనగానపల్లె: స్పర్శలేని మచ్చలు, కనుబొమ్మలు రాలిపోవడం, చేతిలోని వస్తువులు జారిపోవడం వంటివి కుష్టు వ్యాధి లక్షణాలని న్యూక్లియస్ వైద్యాధికారిణి తేజశ్వని అన్నారు. బుధవారం టంగుటూరు, పలుకూరు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో కుష్టు సర్వే నిర్వహించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి పలు సూచనలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో చేసే సర్వేలో వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వైద్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, ఎంపీహెచ్‌ఈ వెంకటేశ్వర్లు, డీపీఈఓ రామచంద్రారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ అయ్యమ్మ ఉన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

సంజామల: ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు సాగుతున్న నేపథ్యంలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముదిగేడు, ముక్కమల్ల సచివాలయాలను ఏడీఏ సుధాకర్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ముక్కమల్ల రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ప్రతి పథకం రైతులకు అందే విధంగా వ్యవసాయ సిబ్బంది అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు కౌలు పత్రాలు తీసుకునేలా అవగాహన కర్యాక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. వారి వెంట సంజామల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు తగదు



ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

కోవెలకుంట్ల: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల జేఏసీ జిల్లా నాయకుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు దివ్యాంగులతో కలిసి బుధవారం కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు ఐఏఎస్‌కు పనికిరారని, వారికి ప్రత్యేక రిజర్వేషన్ అవసరం లేదని మాట్లాడడం సరికాదన్నారు. దివ్యాంగుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన స్మిత సబర్వాల్ దివ్యాంగ సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు. సంఘం నాయకులు ఓబులేసు, శ్రీనివాస రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు రికార్డులు తప్పనిసరి



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బనగానపల్లె రూరల్: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన రికార్డులు, బీమా కలిగి ఉండాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పాతబస్టాండ్, పొట్టి శ్రీరాములు విగ్రహం కూడలి వద్ద వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు లేని పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు వాహన రికార్డులతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: సెక్యూరిటీ సూపర్‌వైజర్ సుమిత్ర ఆత్మహత్యాయత్నానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తూ అధికారుల వేధింపులు తాళలేక ఈనెల 22వ తేదీ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. బుధవారం కేవీపీఎస్ నాయకులు ఆస్పత్రికి వెళ్లి సుమిత్రను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రైల్వేస్టేషన్‌లో బైక్ చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద పార్కు చేసిన బైక్ చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు డోన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన శాంతప్ప తన హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను రైల్వే స్టేషన్ వద్ద పార్కు చేసి వ్యక్తిగత పనుల నిమ్మిత్తం ట్రైన్‌లో కర్నూలు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దాడి కేసు నమోదు

బనగానపల్లె రూరల్: స్థలం విషయంలో నందివర్గం గ్రామానికి చెందిన దానమయ్య, నవీన్, శేఖర్ సహా మొత్తం 11 మంది తమపై దాడి చేసినట్లు అదే గ్రామానికి చెందిన పుల్లయ్య, అతని భార్య రమాదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా కోర్సుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెల్లడించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ పాసైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

## బదిలీ తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ సునీతా బాయిని సన్మానిస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సునీతబాయిని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సాధారణ ఎన్నికల సమయంలో బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు జారీ కావడంతో అనంతపురంకు బదిలీపై వెళ్లారు. కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా ప్రస్తుతం ఎవరూ రాకపోవడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ నాగేశ్వరరెడ్డి వ్యవహరించనున్నారు.

## కూరగాయల మార్కెట్‌లో దుకాణం ధ్వంసం



ధ్వంసమైన కట్ట

డోన్ టౌన్: పాతబస్టాండ్‌లోని ఆధునిక కూరగాయల మార్కెట్‌లో తన కట్టను (అంగడి) కుమార్, అతని ఇద్దరు కుమారులు కలిసి మంగళవారం రాత్రి ధ్వంసం చేసినట్లు బాధితుడు బాలరంగడు మున్సిపల్ అధికారులు, పట్టణ పోలీసులకు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ డీఈ రసూల్, రెవెన్యూ అధికారి మధుసూదన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కమిషనర్ డాక్టర్ జయరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమార్, అతని కుమారులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

# ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు



డోన్ జూనియర్ కళాశాలను తనిఖీ చేస్తున్న డీఐఈఓ

ప్యాపిలి: ఇంటర్ విద్యార్థులు సరైన ప్రణాళిక, క్రమశిక్షణతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని జిల్లా ఇంటర్మీయెట్ విద్యాధికారిణి (డీఐఈఓ) సునీత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలంటే ఇంటర్ పునాది వంటిదన్నారు. చెడు అలవాట్లు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం డీఐఈఓను కళాశాల సిబ్బంది సత్కరించారు. నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డోన్ జూనియర్ కళాశాల తనిఖీ**

డోన్ టౌన్: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు తీర్చిదిద్దాలని డీఐఈఓ సునీత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు, వసతులపై ఆరా తీశారు. గత ఏడాది కంటే ఈ విద్యా సంవత్సరంలో 60 అడ్మిషన్లు పెరిగినట్లు ప్రిన్సిపాల్ కృష్ణయ్య ఆమెకు వివరించారు.

## రైతులకు కేవీకే సహకారం

బనగానపల్లె రూరల్: వ్యవసాయంలో నూతన సాంకేతికతను రైతులకు చేరవేయడంలో కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి అన్నారు. దేశంలో కేవీకే వ్యవస్థ ఏర్పాటు చేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా బుధవారం యాగంటిపల్లెలోని కేవీకేలో స్వర్ణోత్సవ జ్యోతిని ప్రదర్శించారు. ప్రస్తుతం దేశంలో 731 కేవీకేలు ఉన్నాయని, వీటి సంఖ్య వెయ్యికి పెంచే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు.

## ఉపాధి నిధులతో సబ్సిడీ షెడ్లు

కొలిమిగుండ్ల: మినీ గోకులాల పేరుతో ప్రభుత్వం పాడి రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారిణి పద్మావతి బుధవారం తెలిపారు. ఉపాధి హామీ నిధులతో సబ్సిడిపై ఏర్పాటు చేస్తున్నారన్నారు. రెండు పశువుల మిని గోకులం యూనిట్ విలువ రూ.1,15 లక్షలు కాగా రైతు వాటా రూ.రూ.11,500 చెల్లించాలన్నారు. నాలుగు పశువుల షెడ్ రూ.1.85 లక్షలు కాగా రైతులు రూ.18,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆరు పశువుల షెడ్డు రూ.2.30 లక్షలు కాగా రైతు వాటా రూ.23 వేలు. అలాగే 20 జీవాల షెడ్ యూనిట్ రూ.1.30 లక్షలు కాగా రైతు వాటా కింద రూ.39వేలు, 50 జీవాల షెడ్ రూ.2.30 లక్షలు కాగా రైతు వాటా రూ.69 వేలు ఉంటుందన్నారు. అలాగే వంద కోళ్ల షెడ్ యూనిట్ విలువ రూ.87 వేలు కాగా రైతు వాటా రూ.39,600, రెండు వందల కోళ్ల షెడ్ యూనిట్ రూ.1.32 లక్షలు కాగా రైతు వాటా రూ.39,600 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంక్ పాస్ బుక్‌తో పశువైద్యశాల లేదా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

# మందు బాబుల ఆగడాలకు చెక్

సాక్షి ఎఫెక్ట్



సచివాలయం పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాదరెడ్డి

కొలిమిగుండ్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్న మందు బాబుల ఆగడాలకు అధికారులు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కొలిమిగుండ్లలోని గ్రామ సచివాలయం, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో నిత్యం మందు బాబులు మద్యం సేవించి మద్యం బాటిళ్లు, నాటుసారా ప్యాకెట్లను పడేసి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. వీటిపై మందు బాబులకు అడ్డా అనే శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ రావుతో కలిసి సచివాలయం వద్ద పరిసరాలతో పాటు పడేసిన మద్యం బాటిళ్లను పరిశీలించారు. మందు బాబులు లోపలకి రాకుండా గేటుకు తాళం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. బాటిళ్లతో పాటు పరిసరాలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. మందు బాబులు సచివాలయం పరిధిలోకి రాకుండా పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.